

ఓట్ల లెక్కింపుపై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు

జూన్ 4న ఉంగుటూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేసేందుకు యంత్రాంగం పని చేయాలని రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ అన్నారు. ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో కౌటింగ్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి శిక్షణా సమావేశాన్ని నిర్వహించారు. ఉంగుటూరు నియోజకవర్గానికి ఇవిఎంల కోసం 14, పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు మూడు టేబుళ్లు ఉంటాయన్నారు. ప్రతి టేబుల్ వద్ద పర్యవేక్షకులు, సూక్ష్మ పర్యవేక్షకులు, సహాయక సిబ్బంది వంతున నియమించిన ఉద్యోగులు ఎన్నికల ఓట్ల లెక్కింపు క్రతువులో పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఇవిఎంలను తీసుకొచ్చినప్పటి నుంచి లెక్కింపు పూర్తయి వాటిని యథాస్థానంలో భద్రపరిచేంతవరకూ పక్కా రూట్ మ్యాప్‌ను అనుసరించాల్సిందేనని ఆర్‌డిఒ చెప్పారు. నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

తూడు, గుర్రపుడెక్క తొలగించేదెన్నడో..!



తాడేరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

శివారు ప్రాంత భూములకు అందని సాగునీరు
కాలువల అభివృద్ధి నిల్
అధికారులు పనులు చేపట్టాలని కోరుతున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

సాగు, మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉన్న ఆయుకట్టులోనే పంటలు బాగా పండుతాయి. వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన నీరు పూర్తిస్థాయిలో సరఫరా అయితే సాగు ఖర్చులు తగ్గి రైతులు అధిక దిగుబడులు సాధిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ప్రధానంగా డెల్టా ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది కాలువల నీరే. కొన్నాళ్లుగా ప్రధానంగా సాగులో కర్షకులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడమే. జూన్ 1న కాలువలకు నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. మరో పక్క నైరుతి రుతుపవనాలు సైతం జూన్ మొదటి వారంలోనే విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో సాగుకు రైతులు సన్నద్ధమౌతున్నా శివారు భూములకు నీరందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు..

తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు ఉపాధి హామీ నిధులతో చేపట్టడానికి అవకాశం ఉంది. అయితే నిబంధనలు ప్రతిబంధకాలుగా మారాయి. ప్రధానంగా డెల్టా ప్రాంతంలో సాగుదారులకు ఎక్కువగా ఉపయోగపడే పంట కాలువలు, పంట బోదెలు, మురుగు కాలువలు, మురుగు డ్రెయిన్లు ఒక గ్రామం పరిధిలో సుమారు 15 నుంచి 30 కిలోమీటర్ల పొడవునా ఉన్నాయి. ఉపాధి హామీ చట్టంలో గ్రామీణ ప్రాంత రైతులకు ఎక్కువగా అవసరమైన సమయంలో కంటే కూడా అవసరంలేని సమయంలోనే జల వనరులకు శుభ్రం చేసే పనులు చేపడుతున్నారు. ఒక గ్రామంలో ఏడాదికి కేవలం 10 కిలో మీటర్ల పరిధిలో మాత్రమే కాలువల్లో గుర్రపుడెక్క తొలగించాలనే నిబంధన ఉంది. దీంతో అన్ని పంట కాలువలు పూర్తిస్థాయిలో శుభ్రం కావడం లేదు. ఈ తరహాలో చేసిన కొద్దిపాటి పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండడం లేదు.



ఆచంట తాడేరు డ్రెయిన్‌లో యంత్రాలతో గుర్రపుడెక్క తొలగిస్తున్న రైతులు (ఫైల్‌ఫోటో)

వేసవిలోనైనా తొలగించాలంటున్న రైతులు..

రబీకి ముందు పంట కాలువల్లో గుర్రపుడెక్క నివారణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం దాదాపు అన్ని కాలువల్లో దట్టంగా పెరిగిపోయింది. దీంతో పలు కాలువల పరిధిలో నీరు కిందకు వెళ్లక రైతులు పలుచోట్ల సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. మండలంలోని కోడేరు, పెదమల్లం, కరుగోరు మిల్లి, పెనుమంచిలి ప్రాంతాల్లో చిన్నపాటి పంట కాలువల్లో సైతం గుర్రపు డెక్క బాగా పెరిగిపోయింది. తాడేరు డ్రెయిన్‌లో కొడమంచిలి నుంచి పెనుమంచిలి వరకు గుర్రపుడెక్క, చెత్తాచెదారం పేరుకుపోయింది. కందరవల్లి నుంచి వల్లూరు వరకు టన్నుల కొద్దీ గుర్రపుడెక్క పెరిగిపోయింది. గత సార్వాలో డ్రెయిన్లు పూడుకుపోవడంతో రైతులు అష్టకష్టాలు పడి యంత్రాలతో పేరుకుపోయిన గుర్రపుడెక్కను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. పంట భూములకు సాగునీరందించే పంట కాలువలు ఎంత ముఖ్యమో మురుగునీరు బయటకెళ్లే డ్రెయిన్లు అంతే ముఖ్యం. ఏళ్ల తరబడి ఈ డ్రెయిన్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏటా వరదల సమయంలో పంట పొలాలకు ముప్పు తప్పడం లేదు. డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో డ్రెయిన్లలో దట్టంగా తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూడు, గుర్రపుడెక్క ఇలాగే ఉంటే అధిక వర్షాలు కురిసినప్పుడు పంట చేలకు ముంపు సమస్య తప్పదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్రపుడెక్క వల్ల వర్షపునీరు బయటకు లాగాలేకపోవడంతో పంట చేలు ముంపునకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఈ వేసవిలోనైనా పూర్తిస్థాయిలో గుర్రపు డెక్క నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈ వేసవిలో అభివృద్ధి లేనట్లేనా...

డ్రెయిన్ల అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో, మరలా టెండర్లు పిలవడానికి ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో ఈ ఏడాది వేసవిలో డ్రెయిన్ల అభివృద్ధి లేనట్లేనా అనే సందేహం రైతులకు కలుగుతోంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మురుగు డ్రెయిన్లను ఎప్పుడో బాగు చేయించి ఉండేదని అన్నదాతలు అంటున్నారు. ఏటా సార్వా సమయంలో భారీ వర్షాలు పడినప్పుడు వరదనీరు డ్రెయిన్ల ద్వారా కిందకు లాగకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలవడంతో పంట నష్టం తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని డ్రెయిన్లను ఆనుకుని ఉన్న పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, పంట చేతికొచ్చే సమయంలో రైతులు ఆర్థికంగా మరింత అప్పుల పాలై పెట్టుబడులు రాక వ్యవసాయం చేయాలా, మానేయాలనే ఆలోచనలో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మురుగునీరు కిందకు పోయే దారి లేదు..



యల్లమెల్లి శోభన్‌బాబు, కౌలు రైతు, కొడమంచిలి


డ్రెయిన్లు బాగుచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి. లేదంటే వర్షాకాలంలో పంటలకు ముంపు తప్పదు. డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో పొలాల్లో నీరు కిందకులాగే పరిస్థితి లేదు. డ్రెయిన్లు చెత్తాచెదారంతో బక్కచిక్కి పోవడంతో వెడల్పు తగ్గిపోయి నీరు సక్రమంగా కిందకు వెళ్లక పంట పొలాలు ముంపున గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్లను అభివృద్ధి చేయాలి.

తూడు తొలగించాలి..



జక్కంశెట్టి సుబ్బారావు, కొడమంచిలి, కౌలు రైతు

పంట, మురుగు డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో వంతుల వారీ సమయంలో శివారు ప్రాంత భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో సాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. సార్వా సాగు సమయంలో గుర్రపుడెక్క వల్ల పంట పొలాల్లో నీరు బయటకెళ్లే మార్గం లేక ఏటా ముంపుతో దిగుబడి కోల్పోతున్నాం. అధికారులు స్పందించి ఈ వేసవిలోనైనా పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క నివారణకు చర్యలు చేపట్టాలి.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్‌పి, జెసి

కౌంటింగ్‌కు అన్ని విధాలా సన్నద్ధం

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ చెప్పారు. న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్ నుంచి బుధవారం సార్వత్రిక ఎన్నికలు–2024 కౌంటింగ్ సన్నద్ధతపై అన్ని నియోజకవర్గాల ఆర్‌ఒలు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి, త్వరితగతిన కచ్చితమైన ఫలితాల ప్రకటనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను, తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసి హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఆర్‌ఒ డి.పుష్పమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేపట్టామని, కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏలూరు నగర శివారులోని సర్‌సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఇవిఎంలను మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుల్స్, అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున అన్ని నియోజకవర్గాలకు ఏర్పాటు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ సుమారు ఏడు గంటల వ్యవధిలో ఓట్ల లెక్కింపు పూర్తిచేసే దిశగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ పాల్గొన్నారు.

ముగిసిన సీతాదేవి అంత్యక్రియలు

ప్రజాశక్తి - కలిదిండి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎర్నేని సీతాదేవి (74) అంత్యక్రియలు మండలంలోని కొండూరు ఎర్నేని ఎస్టేట్‌లో నిర్వహించారు. ప్రభుత్వ లాంచనాల్లో భాగంగా సీతాదేవి భౌతికదేహంపై జాతీయ జెండాను కప్పారు. అంత్యక్రియలకు ముందు పోలీస్ సిబ్బంది గౌరవార్ధంగా గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, పెనమలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి బోడే ప్రసాద్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ యార్లగడ్డ రవికుమార్, తాడినాడ బాబు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, నాగార్జున హాస్పటల్ అధినేత వైద్యులు కొడాలి జగన్మోహనరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిబాబ్జీ, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, కొడాలి వినోద్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, వీరమల్లు నరసింహారావు, సారిక వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని సీతాదేవి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు రిటర్నింగ్ అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కౌంటింగ్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి, ఫలితాలు వెలువరించే వరకు రిటర్నింగ్ అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిబంధనల మేరకు ఒకొక్క నియోజకవర్గంలోని ఐదు చొప్పున వివి.ప్యాట్‌లోని స్లిప్‌లను లెక్కించడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, లెక్కించిన అనంతరం వాటిని తగు జాగ్రత్తలతో భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ అనంతరం ఎప్పటికప్పుడు కచ్చితమైన ఫలితాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి పలు సూచనలతో దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ సిబ్బందికి ఉదయం అల్పాహారం, నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఇవిఎంలు, వివి ప్యాట్ మిషన్లు, స్లిప్పులు భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఆర్‌ఒ డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులు ఎన్‌ఎస్‌కె.ఖాజావలి, ఎం.ముక్కంటి, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, కె.భాస్కర్, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

దెందులూరు ఆర్‌ఒ లావణ్య వేణి

చిట్‌చాట్

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటింగ్ ప్రక్రియ పూర్తయి పక్షంరోజులు కావస్తోంది. ప్రస్తుతం అందరూ కౌంటింగ్ ఆపై వచ్చే ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు. ప్రధానంగా వివాదాలకు కేంద్రబిందువుగా పిలవబడుతున్న దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి ఓటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడంలో తెగువ చూపిన జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు ఆర్‌ఒ లావణ్యవేణి జూన్ 4న జరిగే కౌంటింగ్ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లపై ప్రజాశక్తి నిర్వహించిన' ముఖాముఖీలో ఆర్‌ఒ లావణ్య వేణి పలు విషయాలు వెల్లడించారు.



ప్రశ్న: దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్‌ఒ : జూన్ 4న జరిగే దెందులూరు కౌంటింగ్‌కు సిఆర్‌ఆర్ కళాశాలలోని ఎంబిఎ బ్లాక్‌లో అన్ని ఏర్పాట్లూ చేశాం. లోక్‌సభకు 14 టేబుల్స్, అసెంబ్లీకి 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్‌కు 2 టేబుల్స్ ఏర్పాటు చేశాం. పోస్టల్ బ్యాలెట్స్ కౌంటింగ్ జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. అది జరుగుతుండగానే ఉదయం 8.30 గంటలకు ఇవిఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

ప్రశ్న : కౌంటింగ్ ఎన్ని రౌండ్లు ఉండబోతున్నాయి? ఎప్పటిలోగా పూర్తవుతుంది?

ఆర్‌ఒ: మొత్తం 239 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన 239 ఇవిఎంలు, కంట్రోల్ యూనిట్స్ లెక్కించడం జరుగుతుంది. పార్లమెంట్‌కు సంబంధించి 5, అసెంబ్లీకి 5 వివిపాట్స్ కూడా లెక్కిస్తాం. 15 మంది అభ్యర్థులు, ఒక నోటా లెక్కించాలి. ఒక్కో ఇవిఎం లెక్కించడానికి సుమారు 25 నుంచి 30 నిమిషాలు పడుతుంది. మొదటి రౌండ్ కాస్త లేట్ కావొచ్చు. తర్వాత రౌండ్స్ త్వరగానే పూర్తవుతాయి.

ప్రశ్న : కౌంటింగ్ కోసం ఎంత మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు?

ఆర్‌ఒ : కౌంటింగ్‌కు సంబంధించి ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ చొప్పున 14 టేబుళ్లకు ఉంటారు. వీరితోపాటు రౌండ్ వైస్ కలెక్షన్ ఏజెంట్స్, స్ట్రాంగ్ రూమ్ నుంచి ఇవిఎం మిషన్లు తీసుకొచ్చే సిబ్బంది సిద్ధంగా ఉంటారు.

ప్రశ్న : కౌంటింగ్ సిబ్బందికి శిక్షణలు ఎంతవరకూ పూర్తయ్యాయి?

ఆర్‌ఒ : ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి అన్ని శిక్షణలు పూర్తిచేశాం. కలెక్టర్, నేను, రాష్ట్రస్థాయి శిక్షణలు ఇచ్చాం. పొలిటికల్ పార్టీలకు సమావేశం నిర్వహించి, కౌంటింగ్ రోజు ఎలాంటి నిబంధనలు పాటించాలి, ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై తెలియజేశాం.

ప్రశ్న : కౌంటింగ్ రోజు ఎలాంటి నిబంధనలు అమల్లో ఉంటాయి?


ఆర్‌ఒ : ఫలితాలు ప్రకటించే వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. 144 సెక్షన్ కూడా అమల్లో ఉంటుంది. జూన్ 6వ తేదీ వరకూ ఎలాంటి ఊరేగింపులు, ప్రదర్శనలు చేయరాదు. కౌంటింగ్ వద్ద చీఫ్ ఏజెంట్స్, ఏజెంట్స్‌కు ప్రత్యేక పాస్‌లు అందజేశాం. పాస్‌లు ఉన్నవారు మాత్రమే అనుమతించిన ప్రాంతానికి చేరుకోగలం. మీడియా పాయింట్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. అక్కడి నుంచే సమాచారం ఎందుకోవడానికి వీలుంటుంది.

వెబ్ కాం రికార్డులను పరిశీలించాలి

ఆర్‌ఒకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 177లో (భువ్వనపల్లి) ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి బినామీ ఓట్లు వేశారని, దీనిపై వెబ్ కామ్, సీసీ కెమెరా రికార్డులను పరిశీలించాలని సిపిఎం నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉంగుటూరులో ఆర్‌ఒ ఖాజావలీని బుధవారం సిపిఎం నాయకులు నారపల్లి రమణారావు, ఆర్.లింగరాజు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన పిఎస్ 177లో పోలింగ్ నిర్ణీత సమయం గడిచిన తర్వాత సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల లోపు ఓట్లు లేనివారు, ఎన్నికల ఏజెంట్లు కానివారు గోడలు దూకి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించి వారికి అనుకూలమైన వారికి దొంగ ఓట్లు వేశారన్నారు. సీసీ కెమెరా రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు బహిర్గతం అవుతాయని చెప్పారు. అంతేకాకుండా పలు చోట్ల రాజకీయ పార్టీల అనుచరులు పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతి భద్రతల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని నాయకులు ఆర్‌ఒను కోరారు. దీనిపై ఆర్‌ఒ మాట్లాడుతూ చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ రోజు, ఆ తరువాత ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఏలూరు డిఎస్‌పికి లేఖ రాసినట్లు ఆర్‌ఒ తెలిపారు.



ఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

2న పాటల పల్లకి సినీ సంగీత విభావరి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి జూన్ నాలుగో తేదీ సందర్భంగా రెండో తేదీ ఆదివారం సాయంత్రం ఏలూరులో పాటల పల్లకి సినీ సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేశామని హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ప్రకటించింది. పవర్‌పేటలోని అన్నే భవనంలో బుధవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవి, కోశాధికారి యు.రవిశంకర్, కమిటీ నాయకులు పి.సూర్యప్రకాష్, కె.శ్రావణకుమారి మాట్లాడారు. ముందుగా పి.సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఎస్‌పి.బాలసుబ్రమణ్యం అనేక భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందారన్నారు. ఆయన 78వ జయంతి పురస్కరించుకుని ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో జూన్ రెండో తేదీ సాయంత్రం 5:30 గంటలకు పాటల పల్లకి పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 40 పాటలతో ఏలూరులోని గాయకులు పాల్గొనేలా కార్యక్రమం రూపొందిస్తున్నామన్నారు. హేలాపురి సింగర్స్ అసోసియేషన్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న బాల సుబ్రహ్మణ్యం సినీ సంగీత విభావరి ప్రోగ్రాంలో బాలసుబ్రహ్మణ్యం పాటల అభిమానులు, గాయకులు, కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్.లక్ష్మి, ఎం.సిద్ధార్థసాయి, లహరి, అంకిత, హిమ బిందు, జ్ఞానేశ్వభరి సాధిఖ్, బిలాల్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు నియోజకవర్గ ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జాయింట్‌కలెక్టర్, ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి బుధవారం తనిఖీ చేశారు. ఏలూరులోని సర్‌సి ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను ఆమె పరిశీలించారు. ఇవిఎం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఇవిఎంలకు, తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర పారా మిలిటరీ బలగాలతో సహా మూడంచెల భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో ఆమె సంతకం చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాల్లో జరిగిన మొదటి సంవత్సరం భౌతికశాస్త్రం, అర్ధశాస్త్రం పరీక్షలకు మొత్తం 4,242 మందికి 3,913 మంది హాజరు కాగా 329 మంది గైర్హాజరయ్యారు. 92 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 3,898 మందికి 3,605 మంది హాజరు కాగా 293 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్య విభాగంలో 344 మందికి 308 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం భౌతికశాస్త్రం, అర్ధశాస్త్రం పరీక్షలకు మొత్తం 1,542 మందికి 1,430 మంది హాజరు కాగా 112 మంది గైర్హాజరయ్యారు. 93 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 1,310 మందికి 1,228 మంది హాజరు కాగా 82 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 232 మందికి 202 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు.

ప్రశాంతంగా పది సప్లమెంటరీ పరీక్ష

ఏలూరు సిటీ :జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ భౌతిక శాస్త్ర పరీక్షకు 8289 విద్యార్థులకు 4251 మంది మాత్రమే హాజరయ్యారని, 4038 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో రోజు మొత్తం 14 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

చాట్రాయి : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 99 మంది విద్యార్థులకు 53 మంది హాజరైనట్లు ఎంఇఒ విఎస్‌వి.బ్రహ్మాచారి తెలిపారు.

పోలవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 130 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వి.సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఫిజిక్స్ పరీక్షకు 211 మంది హాజరు కావాల్సి ఉండగా 81 మంది మాత్రమే హాజరయ్యారని మిగిలిన 130 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలి

రోజు కూలీ రూ.600 ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - లింగపాలెం

పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి పేదలకు కూలీ సక్రమంగా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, తోచిలక రాయుడుపాలెం, గుణిజర్ల గ్రామాలలో ఉపాధి పని ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల పోరాటాలతో వచ్చిందన్నారు. ఈ చట్టం గ్రామాల్లో వ్యవసాయ కూలీల కుటుంబాల్లో వెలుగులు తీసుకొచ్చిందన్నారు. వలసలు అగాయని, కూలీలు ధైర్యంగా బతుకుతున్నారన్నారు. ఇటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అందుకే ఉపాధి హామీ చట్టంలో రెండు పూటలా పని పెట్టి కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది రూ.90 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే ఈ ఏడాది రూ.60 వేల కోట్లు కేటాయించి నిధులు తగ్గించారన్నారు. మేట్లకు ప్రోత్సాహం ఇవ్వడం లేదని, పారలు, గునపాలు, తట్టలకు డబ్బులు వేయడంలేదన్నారు. టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు, మజ్జిగ సరఫరా చేయడంలేదన్నారు. వ్యవసాయంలో యంత్రాలు పెరుగుతున్నాయని, కరోనా తర్వాత కూలీలు వలసలు వెళ్లడానికి భయపడుతున్నారని తెలిపారు. ఒక సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజు కూలీ సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కూలీలందరూ వ్యవసాయ కార్మిక సంఘంలో చేరి పోరాటాలకు సన్నద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాబూరావు, జ్యోతి, సుబ్బారావు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

చాట్రాయి :మండలంలో ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హోలీమేరి డిమాండ్ చేశారు. అలాగే మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, ప్రతివారం వారి ఖాతాలో కూలి డబ్బులు జమ చేయాలని, కూలీలకు రూ.600 వేతనం చెల్లించాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. వేసవికాలం సమయంలో అదనంగా వేతనం ఇవ్వాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సబ్‌స్టేషన్‌లో అసాంఘిక కార్యకలాపాలు
విధుల నుంచి షిఫ్ట్ ఆపరేటర్‌ను తొలగింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో పేరంపేట రోడ్డులో ఉన్న జంగారెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గంగు మహేష్ రెడ్డిని విధుల నుంచి తొలగించారు. సబ్‌స్టేషన్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినందుకు అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. స్థానిక 9, 10వ వార్డుల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంతసేపటికీ రాకపోవటంతో కొంతమంది స్థానికులు సబ్ స్టేషన్ దగ్గరకు వెళ్లి చూడగా షిఫ్ట్ ఆపరేటర్ మహేష్ పూర్తిగా మద్యం తాగి మహిళతో ఉన్నాడు. దీంతో సంబంధిత విద్యుత్ సబ్‌స్టేషన్ ఎడి రాధాకృష్ణకు సమాచారం అందించగా ఆయన అక్కడకు చేరుకుని మహేష్ రెడ్డి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని నిర్ధారణకు వచ్చి జంగారెడ్డిగూడెం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహేష్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎడి రాధాకృష్ణ తెలిపారు. అంతేకాకుండా మహేష్ రెడ్డిని పూర్తిగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో విద్యుత్ కోతల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఫోన్ చేసినా ఎవరూ స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు.



ఏలూరులో...

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంపు) చాలా ఉత్సాహంగా సాగుతుంది. ఈ శిక్షణ శిబిరానికి వివిధ పాఠశాలల విద్యార్థులు చాలా హుషారుగా పాల్గొంటున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుండి 11:30 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం సాగుతుంది. రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి దేవిని ప్రార్థన గీతాలతో ప్రారంభించారు. తెలుగు పుస్తక పఠనంలో నీతి కథలు చదివించి కథల్లోని నీతిని చిన్నారులతో వివరించారు. అనంతరం పర్యావరణం-పరిరక్షణ, వృక్షో రక్షతి:రక్షిత అంశంపై ఒక స్క్రిప్టును చిన్నారులతో వేయించారు. అనంతరం ప్రముఖ డ్రాయింగ్ టీచర్, రిసోర్స్ పర్సన్ కె.శంకర్ విద్యార్థులకు రకరకాల డ్రాయింగ్స్ (చిత్రలేఖనం) పై మెలకువలు నేర్పిస్తూ శిక్షణ కొనసాగించారు. మధ్యలో విద్యార్థులందరికీ స్నాక్స్, చల్లటి పానీయాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది వి.టి.సందీప్‌కుమార్, ఎండి.ఇస్మా పాషా పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం బుధవారంతో 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర గురించి వివరించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులు గ్రంథాలయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పరసా అంకిత, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి భరత్‌రాయ్‌కు అభినందన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఈదులగూడెనికి చెందిన ఆరో తరగతి విద్యార్థి దేవరపల్లి భరత్‌రాయ్ ఈ నెల 21 నుంచి 24 వరకు నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించినట్లు విద్యార్థి తండ్రి దేవరపల్లి వేణు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి భరత్‌రాయ్, కోచ్ జాన్సి విద్యార్థులను గ్రామ సర్పంచి చిట్టేని విజయ శేఖరరావు, గ్రామ ప్రముఖులు చిట్టేని శివరామకృష్ణ, గ్రామస్తులు సత్కరించి అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న సర్పంచి, గ్రామ ప్రముఖులు

నేరాలు - ఘోరాలు

టైలర్‌పై పోక్సో కేసు

ప్రజాశక్తి - కైకలూరు

కొలతలు తీసుకుంటానని షాపునకు పిలిచి బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన టైలర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ ఆకుల రఘు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ బాలిక ఆ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యంతో టైలర్ తన దుకాణంలోకి పిలిచి డ్రెస్ కోసం కొలతలు తీసుకుంటానని అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక జరిగిన సంగతిని తల్లిదండ్రులకు వివరించింది. దీంతో టైలర్‌పై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి టైలర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు.

18 మంది వాహనదారులపై కేసు

ప్రజాశక్తి - కైకలూరు

ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు గోనెపాడు వద్ద వాహనాల తనిఖీ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం 18 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.6,400 జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు వేర్వేరు ఆవాస ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... అరుంధతీ కాలనీ ఆవాస ప్రాంతానికి చెందిన భీమడోలు మహాలక్ష్మమ్మ(38) ఏలూరు వెళ్లేందుకు బస్సు కోసం లింగంపాడు వంతెన సమీపంలో రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ వాహనం ఒకటి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహాలక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మరొక సంఘటనలో అర్జావారి గూడెం ఆవాస ప్రాంతానికి చెందిన వల్లూరి జయరాజు(58) కు ఇతర వ్యక్తులతో చిన్నపాటి గొడవలు జరిగాయి. ఆ వ్యక్తులు దాన్ని దృష్టిలో ఉంచుకుని జయరాజుపై ఈ నెల 27వ తేదీన మజ్జిగలో ఎలుకల మందు కలుపుకుని తాగాడు. గమనించిన ఆయన కుటుంబ సభ్యులు ఆయనను ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం జయరాజు మృతి చెందారు. చనిపోయినవారి కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కైకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శ్రీకాకుళానికి చెందిన రామకృష్ణ సుమారు ఆరేళ్ల నుంచి మండవల్లిలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున రామకృష్ణ కైకలూరు రైల్వేస్టేషన్ సమీపంలో గేటు దాటుతుండగా ఉత్తరప్రదేశ్ నుంచి కాకినాడ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం
గూటాల జెడ్‌పి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్

ప్రజాశక్తి - పోలవరం



కెవి.రాఘవన్

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అంకితభావంతో విద్యాబోధన చేస్తున్నామని మండలంలోని గూటాల జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ పాఠశాల 1951లో దాత ముడుంబై వెంకటరంగా అనహరాచార్యులు వారి ప్రోత్సాహంతో, సహకారంతో ప్రారంభించినట్లు చెప్పారు. సుమారు 3.86 ఎకరాల భూమిని పాఠశాలగా దానంగా ఇచ్చారన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. తాను, ఉపాధ్యాయులు బొరసు వెంకటబాలాజీ ఈ పాఠశాలలోనే చదువుకుని ఇప్పుడు ఇక్కడే ఉద్యోగం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2021-2022 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారన్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పొడుం ప్రజ్ఞ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైందని చెప్పారు. ఇదే విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 587 మార్కులతో జిల్లాలోనే ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. 2021-2022 విద్యా సంవత్సరంలో దవల ఈశ్వర్, 2022-2023 విద్యా సంవత్సరంలో జల్లా ఆకాంక్షకుమార్ ఐఐటికి ఎంపికయ్యారన్నారు. పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 2022-2023 విద్యా సంవత్సరం నుంచి మహిళా జూనియర్ కళాశాల ఎంపిసి గ్రూపుతో ప్రారంభించినట్లు చెప్పారు. పిల్లల్లో స్ఫూర్తి నింపడానికి సిఎస్ఐఆర్ సైంటిస్ట్ శ్రీ బాపూజీ, బ్రిగేడియర్ గణేష్ వారితో విస్తృతమైన చర్చలు, వారి సహకారంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్నామని చెప్పారు.

మౌలిక సదుపాయాలు

అన్ని తరగతులకు గదులు ఉండటమే కాకుండా, ప్రతి తరగతిలోనూ ఇంటర్నెట్‌తో కూడిన ఐఎఫ్‌పిలు పది ఉన్నాయన్నారు. వాటితో బైజూస్ కంటెంట్‌తో బోధన చేస్తున్నామన్నారు. ఇవి కాక 8, 9 విద్యార్థులకు ట్యాబ్స్ అందించినట్లు చెప్పారు. తాగునీటికి ఆర్‌ఒ ప్లాంట్ సౌకర్యం ఉందన్నారు. ఈ మధ్యనే పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఫర్నీచర్‌ను బాగు చేసి ఉపయోగంలోకి తీసుకొచ్చామన్నారు. గతేడాది పాఠశాల పిఎంశ్రీకి ఎంపికైందని, మొదటి విడతగా రూ.లక్ష గ్రౌండ్ బాగు చేసుకోవడానికి విడుదల చేశారన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉందన్నారు. ఒఎన్‌జిసి వారి సహకారంతో పాఠశాలలో 3కే వాట్స్ సోలార్ కరెంటును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దాతల సహకారం

మొదటి నుంచి ఈ పాఠశాలకు దాతల సహకారం ఎంతో ఉందన్నారు. 2021లో పాఠశాలలో గ్రంథాలయ అభివృద్ధికి దాత పచ్చిపులుసు రాంబాబు వారి సహకారంతో శాస్త్రవేత్తల ఫొటోలు ఏర్పాటు, పుస్తకాలు పెట్టుకునేందుకు రాక్స్, విద్యార్థులు కూర్చుని చదువుకునేందుకు ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది సుమారు రూ.లక్ష విద్యార్థుల ప్రతిభను మెచ్చి దాతలు బహుమతులుగా ఇచ్చారన్నారు. గ్రామస్తుల సహకారంతో కళావేదిక నిర్మాణం, సీసీ కెమెరాలు, హ్యాండ్ వాష్‌లు, బల్లలు, కుర్చీలు, కంప్యూటర్లు అందించినట్లు చెప్పారు. ప్రత్యేకంగా పాఠశాల ఉపాధ్యాయులు ప్రింటర్లు, గేటు అందించారు.



గూటాల జెడ్‌పి హై స్కూల్

పిఎంశ్రీకి ఎంపిక

పాఠశాల ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాకు ఎంపికైందని తెలిపారు. దీంతో పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాట్లతో పాటు షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబాడ్డీ, కోకో కోర్టుల ఏర్పాటుకు కూడా అనుమతులు వచ్చాయని, ఇప్పటికే ఆట స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి నేలను పూర్తిస్థాయిలో చదును చేశామని తెలిపారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు చదువులోనే కాకుండా సహ పాఠ్యాంశాల్లో ప్రతిభ చూపుతున్నారన్నారు. తెలుగు అష్టావధానం, భువన విజయం, ఇంద్రసభ, గణిత అవధానం, మాక్ పార్లమెంట్, స్పెల్ బి, పిల్లల ప్రతిభ ప్రదర్శనలు వంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. పాఠశాల, మండల, జిల్లా సైన్స్ ఫెయిర్లలో పాల్గొని బహుమతులు సాధించారన్నారు.

అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు

పాఠశాలలో అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కృషి చేయడం వల్లే మంచి ఉత్తీర్ణతతో పాటు పాఠశాల జిల్లాలో ప్రథమ స్థానంలోనే నిలిచిందన్నారు. విద్యార్థులను సొంత బిడ్డల వలే భావించి వారికి తగినట్లుగా ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఆయన ఉపాధ్యాయులకు, సిబ్బందికి, దాతలకు, గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందిస్తున్న సహాయాన్ని తల్లిదండ్రులు తెలుసుకుని తమ పిల్లలను చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది వేయాలని తెలిపారు.

విద్యార్థుల భవితకు భరోసా
జంగారెడ్డిగూడెం జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని లోవకుమారి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



జంగారెడ్డిగూడెం జెడ్‌పి హైస్కూల్

కార్పొరేట్‌కు ధీటుగా విద్యార్థుల భవితకు భరోసా కల్పిస్తున్నామని జంగారెడ్డిగూడెం జిల్లా ప్రజా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. 1949లో ఒక పెంకుటింట్లో పాఠశాల ప్రారంభమైందని చెప్పారు. ఈ పాఠశాలలో చదివినవారు ఉద్యోగాల రీత్యా దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. హైస్కూలు దినదినాభివృద్ధి చెందుతూ ప్రభుత్వ సహకారంతో స్కూల్ భవనం రూపుదిద్దుకుందన్నారు. ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు విజయదుందుభి మోగిస్తున్నారన్నారు. తమ పాఠశాలలో విశాలమైన తరగతి గదులు ఉన్నాయని, విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడి విద్య అందిస్తున్నామన్నారు. విశాలమైన ఆట స్థలంలో విద్యార్థులకు మాన సికోల్లాసాన్ని కలిగించే విధంగా క్రీడా స్ఫూర్తిని నింపుతున్నామని చెప్పారు. ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో గత నాలుగేళ్ల నుంచి విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. పాఠశాలలో వర్చ్యువల్ తరగతి గదులు, రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆధునిక బోధన, సువిశాలమైన ప్రత్యేక గ్రంథా లయం, ప్రతి తరగతి గదిలో ఐదు ఫ్యాన్లు, ఐదు ట్యూబ్ లైట్స్, ఐఎఫ్‌పి ఇంటర్నెట్ సదుపాయంతో వర్కింగ్ కంప్యూటర్ ల్యాబ్, ఐసిటి లెర్నింగ్, ఓపెన్ టెన్త్ ఓపెన్ ఇంటర్ వంటి సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విజయాలను సాధిస్తు న్నామని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థి చింతపల్లి ప్రశాంత్ 580 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచాడన్నారు. 27 మందికి పైగా 500 మార్కులు సాధించారన్నారు. ఎన్‌సిసిలో బాలురకు, బాలికలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.



లోవకుమారి

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పరింపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు జిల్లా వారి ఆదేశానుసారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఇఒ-1 జె.సురేష్‌బాబు తెలిపారు. రోజు వారీ మెనూ తయారీ, పాటించాల్సిన పరిశుభ్రతపై ఎంఇఒ-2 సిహెచ్.వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రిపురేశ్వరి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఉమాదేవి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

చాట్రాయి : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, హెల్పర్లకు మండల స్థాయిలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం చిత్తపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చాట్రాయి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంతో పాటు సోమవారం నుంచి శనివారం వరకు పాఠశాలలో పిల్లలకు వండి పెట్టే మెనూపై పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో న్యూట్రిషన్ మైక్రోనట్స్ కలిగిన భోజనాన్ని అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చాట్రాయి మండలంలోని ఏడు హైస్కూల్, ఏడు ప్రైమరీ, 49 ప్రైమరీ పాఠశాలలో పని చేస్తున్నటువంటి మధ్యాహ్న భోజన పథకంలో వంట చేసేటువంటి వంట ఏజెన్సీ కార్మికులకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, కొవ్వు విటమిన్స్, మినరల్స్ ఉండే పదార్థాలను వివరించారు.

టి.నరసాపురం : విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంఇఒ ఎస్.కళ్యాణి సూచించారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం ద్వారా వంట చేసే కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడానికి కావాల్సిన విధి విధానాలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి శిక్షణ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కె.అపరంజమ్మ, ఆపరేటర్ కరిముల్లా, సిఆర్‌పిలు రమేష్, రాజేష్, ఎంఐఎస్ కె.సుధాకరరావు, ఎకౌంటెంట్ చందన పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టునకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన మోహన రంగారావు బుధవారం రూ.లక్ష విరాళం దేవస్థానం సూపరింటెండెంట్ డివిఎస్ఎస్.రాజుకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్లు, స్వామి వారి ప్రసాదములు అందించారు.

కృత్రిమ అవయవాలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆహ్లాదకరమైన వాతావరణంలో పలు రకాలైన ఇబ్బందుల్లో ఉన్న చిన్నారులకు ఉచిత విద్య, వసతి ఏర్పాటు చేయటంతో పాటు, అంధ విద్యార్థులకు సాధారణ విద్య, బ్రెయిలి లిపి, కంప్యూటర్ విద్య, వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా అందించడం ఎంతో అభినందనీయమని ధనశిక్ష ఛారిటీస్ సభ్యులు తోట శ్రీనివాస్, బొల్లిగర్ల రవితేజ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో కర్నూల్‌కు చెందిన శీపురపు మేఘన, టి.నరసాపురానికి చెందిన ఆచంట లిఖితసాయి, ప్రకాశం జిల్లా యర్రగొండపాలేనికి చెందిన యల్లనూరి హారికలకు కృత్రిమ కాళ్లను తోట లక్ష్మణ్ తల్లిదండ్రులు తోట శ్రీనివాస్, పార్వతి వివాహ వార్షికోత్సవం, బొల్లిగర్ల రవితేజ యాదవ్ మాతృమూర్తి కీర్తిశేషులు బొల్లిగర్ల హైమావతి జ్ఞాపకార్థం, ధనశిక్ష ఛారిటీస్ వితరణతో బొల్లిగర్ల రాజారావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, ధనశిక్ష ఛారిటీస్ ప్రతినిధులు రోహిత్ యాదవ్, పార్థసారధి యాదవ్, కృత్రిమ అవయవకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - మండవల్లి

స్థానిక స్టేషన్ రోడ్డు లోని ఉదగిరి పాండురంగారావు సతీమణి కమలాదేవి బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బోయిన రాము కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు సజ్జ బాబి, గుడివాడ చిట్టిబాబు, బికెఎం నాని, పూల రామచంద్రరావు, (రాజి) పైడిపాటి శివశంకర్, కొల్లి బాబి, తోట లక్ష్మి, ముల్లపూడి సత్తిబాబు, గుడివాడ గణేష్, విజయ్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : టిడిపి సీనియర్ నాయకులు పరసా ఏడుకొండలు ఇటీవల సింగరాయపాలెంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ బుధవారం మండలంలోని విశ్వనాద్రిపాలెంలో ఏడుకొండలు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు వీరమల్లు నరసింహారావు, బొర్రా చలమయ్య, కె.వినోద్, బొర్రా శేషు ఉన్నారు.

కొత్త పట్టిసీమలో విద్యుత్ సమస్య
లైన్‌మెన్‌ను నిలదీసిన దళితులు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో స్థానిక అంబేద్కర్ పేట ఏరియాలో సింగల్ ఫేజ్ డిటిఆర్ ఓవర్ లోడు వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో బుధవారం స్థానిక ప్రజలు ఎడిషనల్‌లోడ్ బిల్లులు కట్టించుకోవడానికి వచ్చిన లైన్‌మేన్‌ని నిలదీశారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండడం వల్ల వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, అనారోగ్యాలతో మంచాన ఉన్నవారు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్య పరిష్కరించే వరకూ వెళ్లనిచ్చేది లేదని లైన్‌మేన్‌ని నిలదీశారు. దీంతో లైన్‌మేన్ వివరణ ఇస్తూ ఆ ప్రాంతంలో డిటిఆర్ ఏర్పాటు కోసం నివేదికలు పెట్టామని, ఉన్నతాధికారులు స్పందించి ఎడ్జస్టింగ్ డిటిఆర్ ఏర్పాటు చేసే వరకూ పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని వివవరించారు. సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని లైన్‌మేన్‌ను కోరారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎఇ కొండా సత్యనారాయణను వివరణ కోరగా సింగల్ ఫేజ్ వల్ల లో ఓల్టేజీ వస్తుందని సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ముసునూరు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్ భవన్‌లో విత్తన కంపెనీలకు చెందిన ఏజెంట్లు, కూలీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస వేతనాలను కూలీలకు అందించాలన్నారు. విత్తన కంపెనీలు రూ.కోట్లు లాభాలు గడిస్తూ నిత్యం కూలీలుగా పనిచేస్తున్న పేదలను నిర్లక్ష్యం చేస్తున్నట్లు చెప్పారు. కూలి పనులే జీవనోపాధిగా నమ్ముకుని ముందడుగు వేస్తున్న నిరుపేదలను నైపుణ్యం కలిగిన కూలీలుగా గుర్తించి సమాన వేతనాలను కేంద్ర ప్రభుత్వం సూచించిన మేరకు ఇవ్వాలన్నారు. కూలి పనుల్లో ప్రమాదాలు సంభవిస్తే ఆ కుటుంబాలను కంపెనీలే ఆదుకోవాలన్నారు. కూలీలకు బీమా, కార్పొరేట్ స్థాయి వైద్యం, కూలీల కుటుంబాల్లోని చిన్నారుల చదువుల బాధ్యత కంపెనీలే వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పేదలైన కూలీల తరపున డిమాండ్లు సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జువ్వాల బాబ్జి, యూనియన్ నూజివీడు, ముసునూరు, బాపులపాడు మండలాల కోఆర్డినేటర్లు భూక్యా రంగా, బుడుపుల జయశ్రీ, గండికోట భవాని, యూనియన్ యూత్ కన్వీనర్ బుడుపుల యశస్విని, వివిధ కంపెనీలకు చెందిన ఏజెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలి

మండవల్లి : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని వండి పెట్టాలని ఎంఇఒ రత్నసునాదం తెలిపారు. స్థానిక మండల వనరుల కార్యాలయంలో భోజన పథక సిబ్బందికి కుకింగ్ కాంపిటేషన్‌పై బుధవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు న్యూట్రిషన్, మైక్రోనట్ కలిగిన భోజనాన్ని వండి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రీసెర్చ్ పర్సన్ కె.ధనలక్ష్మి, పాఠశాలల మధ్యాహ్న పథక సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని ఎస్ఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల గుర్తింపును రద్దు పర్చినట్లు ఆగిరిపల్లి ఎంఇఒ-1 కలపాల సర్వేశ్వరరావు తెలిపారు. సకాలంలో పాఠశాలకు చెందిన గుర్తింపును యాజమాన్యం రెన్యువల్ చేసుకొని కారణంగా గుర్తింపును రద్దు పర్చినట్లు, సదరు పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు గుర్తింపు కలిగిన పాఠశాలల్లో చేర్పించుకోవాలని ఆయన కోరారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా చికిత్స కేంద్రంలో బుధవారం పది మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో రక్త యూనిట్ల నిలవలు తగ్గుతున్నాయని, అయినప్పటికీ క్రమం తప్పకుండా రక్త మార్పిడి జరిగేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంవత్సరానికి రెండుసార్లు తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా మీద ప్రత్యేక వైద్య నిపుణులతో క్యాంపులను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. తలసేమియా సికిల్ సెల్ ఎనీమియా చిన్నారులకు, వారి సహాయకులకు 25 మందికి మానవత సభ్యులు ఎం.సౌమ్య, రవి దంపతులు భోజనం ఏర్పాటు చేశారని, కోనేరు రవీంద్ర డ్రై ఫ్రూట్లను పంపిణీ చేశారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని డి3-ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11కెవి వట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11కెవి ఎపిఎఫ్ ఫీడర్ బ్రేకర్ మరమ్మతులు 30వ తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేయనున్నట్లు ఏలూరు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జెపిబి.నటరాజన్ తెలిపారు. ఈ నేపథ్యంలో వట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని వట్లూరు ఏరియా, ఎస్ఎంఆర్ ఫార్చ్యూన్ ఏరియా, సీతారాంపురం రోడ్డు, ఏలూరు ఇంజినీరింగ్ కాలేజీ, సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంకు అప్పారావు, సోంబసవరాజుల వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్వాతంత్ర సమరయోధులు, రైతు సంఘం నాయకులు సంకు అప్పారావు, చేనేత కార్మిక సంఘ నాయకులు కనకం సోంబసవరాజు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక స్ఫూర్తి భవనంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంకు అప్పారావు చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కనకం సోంబసవరాజు చిత్రపటానికి చేనేత కార్మిక సంఘం నాయకులు యర్రా వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అప్పారావు, సోంబసవరాజుల జీవితాన్ని వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, చేనేత కార్మిక సంఘ నాయకులు కనకం జగన్, సిపిఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

పట్టణంలోని ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో 17ఎ బెటాలియన్ ఎన్‌సిసి క్యాంపు నిర్వహిస్తున్నారు. క్యాంపులో భాగంగా బుధవారం అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి ఎన్‌సిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ విశ్వనాథ్, క్యాంపు కెప్టెన్ డాక్టర్ సిహెచ్ఎస్ఆర్.నవీన్‌కుమార్ మాట్లాడుతూ అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గృహ సముదాయాలు, ఇళ్ల వద్ద అనుకోని రీతిలో సంభవించే అగ్ని ప్రమాదాలకు భయపడకుండా, తమని తాము రక్షించుకుంటూ, ప్రజలను రక్షించే కార్యక్రమం పట్ల సులువైన మార్గాలను వివరించారు. పేలుడు పదార్థాలను జన జీవనానికి దూరంగా ఉంచాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు భయపడకుండా ప్రమాద నివారణ, రక్షణకు అన్వేషణ సాగించాలన్నారు.